క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, లోధా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుందర్‌నగర్, మోడల్‌కాలనీ. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఎస్‌ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ–మార్ట్ ఎదురు ప్రాంతంలో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

'తలసాని విజయం ఖాయం'



శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన వాకర్స్ అసోసియేషన్ నాయకులు

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజయం సాధించడం ఖాయమని కేఎల్‌ఎన్‌వై పార్కు వాకర్స్ అసోసియేషన్ చైర్మన్ షాబాద్ శ్రీనివాస్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతో తలసాని అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షిస్తూ బుధవారం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చంటి రాజు, ఈశ్వర చారి, శంకర్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఐనోన్ చర్చి వార్షికోత్సవం



క్రైస్తవ గీతాలను ఆలపిస్తున్న బృందం

లాలాపేట: తార్నాకలోని ఐనోన్ చర్చి 34వ వార్షిక మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐనోన్ చర్చ్ అండ్ మినిస్ట్రీస్ వివిధ ప్రాంతాల్లో ఉన్న బ్రాంచ్ సంఘాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్వయర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రైస్తవ సంగీత కార్యక్రమంలో భక్తి గీతాలు ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గత 33 సంవత్సరాల నుంచి చర్చి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్. విలియం కేరి వివరించారు. ఈ కార్యక్రమంలో హెబ్సిబా కేరి, క్రైస్తవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌కు పుస్తకాలు అందజేత

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌కు మాజీ సీజేఐ ఎన్వీ రమణ పుస్తకాలను అందజేశారు. వయోవృద్ధులకు ఉపయోగపడే వివిధ రకాల పుస్తకాలను బుధవారం ఎన్వీరమణ తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా కౌన్సిల్‌కు అందజేశారు. ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, లా అండ్ ఆర్డర్ చట్టాల గురించి వివరిస్తూ రూపొందించిన పుస్తకాలు ఉన్నట్లు కౌన్సిల్ అధ్యక్షులు మాణిక్‌రావు తెలిపారు. ఈ పుస్తకాలను కౌన్సిల్‌లో అందరికి అందుబాటులో ఉంటాయన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న నరసింహ కన్నన్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలని టీపీసీసీ మాజీ కార్యదర్శి నరసింహన్ కన్నన్ దరఖాస్తు సమర్పించారు. బుధవారం గాంధీభవన్‌కు స్థానిక నేతలతో కలిసి మహేష్‌గౌడ్‌కు తమ దరఖాస్తు సమర్పించారు. గత నలభై ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి తాను కష్టపడ్డానని పార్టీ అధిష్ఠానానికి తెలిపారు. నరసింహ కన్నన్‌కు మద్దతుగా అడ్వొకేట్ వినోద్, గజ్వేల్ భరత్, నాసర్, హైదర్, అష్రాఫ్, యాదగిరి, తెహసిన్, అన్నానగర్ మురళి, ప్రేమ్ రాజ్, రవి, బాబు, అరవింద్, రషీద్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి..





కోట నీలిమా

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి టికెట్టు ఇవ్వాలంటూ ఇద్దరు నేతలు బుధవారం గాంధీ భవన్‌లో దరఖాస్తులు సమర్పించారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని కోరుతూ దరఖాస్తులు అందజేశారు.

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి నామాలగుండు శ్రీవారి ఆలయ వేడుకలు
- మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 24 (గురువారం) నుంచి శనివారం వరకు ఆలయ పదమూడవ వార్షికోత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు సంతానార్థుల కోసం మహా గరుడహోమం, సహస్ర కలశాభిషేకం, శ్రీవారి అభిషేకం, శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, శనివారం సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, విష్ణు సహస్రనామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు తెలిపారు.



ఆలయ నిర్మాణానికి ముందు నామాల ఆకారంలో ఉన్న గుండు (ఫైల్)

నామాల ఆకారంలో వెంకన్నస్వామి..

ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో పెద్ద బండరాళ్లు (గుండు) ఉండేవి. మూడు రాళ్లు కలిసి నామాల ఆకారంలో ఉండడంతో ఈప్రాంతానికి నామాలగుండు అనే పేరు వచ్చింది. ఈ గుండును సాక్షాత్తు వెంకన్న స్వామి ప్రతిరూపంగా కొలిచేవారు. ప్రతిఏటా తొలి ఏకాదశి రోజున గుండుకు సున్నం, జాజుతో నామాలు అద్ది ప్రత్యేక పూజలు చేపట్టేవారు. ఈ క్రమంలో గుండును యథావిధిగా ఉంచి చుట్టూ స్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు స్థానిక నాయకుడు నోముల ప్రకాశరావు ముందుకు వచ్చి కోట్లాది రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పదమూడేళ్ల క్రితం స్వామివారి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించి, ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. తిరుపతి, తిరుమల దేవస్థానంలో నిర్వహించే కైంకర్యాలన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..



స్వామివారి ఆశీస్సులతోనే ఆలయ నిర్మాణం జరిగింది. బ్రహ్మోత్సవాలలో ఆధ్యాత్మికత భక్తిభావం వెల్లివిరియాలనే ఆశయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం. మహామండపం, ధ్యానమందిరం నిర్మాణాలు పూర్తయ్యాయి. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండవ శనివారం స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నాం. వైదిక సహసోదారులు బిజుమళ్ల శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు హరిశివప్రసాదశర్మ నేతృత్వంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

–నోముల ప్రకాశరావు, ఆలయ ఫౌండర్ చైర్మన్

చంద్రయాన్‌-3 విజయోత్సవాలు



జాతీయా జెండాలతో ర్యాలీ

లాలాపేట: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం సందర్భంగా బుధవారం రాత్రి తార్నాక డివిజన్ లాలాపేటలో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. జాతీయ పతాకాన్ని చేతబూని జయ హో భారత్ అంటూ విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. లాలాపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాము వర్మ, వేణుయాదవ్, వెంకటేష్‌గౌడ్, పోచయ్య యాదవ్, బిక్షపతి, శ్రీనివాస్ చారి, ఆకుల శ్రీనివాస్, వేణు, శశి, గోపి, ఉపేందర్, ప్రమోద్, వినయ్, గణేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సరికొత్త రికార్డు..

లాలాపేట: అంతరిక్ష చరిత్రలో భారత్ చంద్రయాన్–3 ప్రయోగంతో సరికొత్త రికార్డును సృష్టించినట్లు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రయోగాలు చేసి దేశానికి అవసరమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆకాంక్షించారు.

గిరిజన మహిళపై దాడి చేసిన పోలీసులను డిస్మిస్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులి కల్పన

అడ్డగుట్ట: గిరిజన మహిళపై దాడి చేసిన పోలీసులను సర్వీసు నుంచి తొలగించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు పోలీసులు గృహ కార్మికురాలైన గిరిజన మహిళ లక్ష్మీబాయి ఇంటికి వెళ్లడానికి ఆటో కోసం ఎదురు చూస్తుండగా అకారణంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేయడం దారుణం అన్నారు. ఈ దుశ్చర్య జరిగిన ఎల్‌బీనగర్ సీఐని సస్పెండ్ చేసి దాడికి పాల్పడిన పోలీసులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్రెండ్లీ పోలీసులు అంటే దళిత, గిరిజన, మైనారిటీలను హింసించడమేనా అని ప్రశ్నించారు. ఇకనైనా లాకప్‌లో హింసలు, డెత్‌లు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కవిత, సరస్వతి, సంజీవ్, రాజేందర్, దాసరి, ఎగొండ స్వామి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు టికెట్లు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

అడ్డగుట్ట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన జాబితాలో ఒక్క ముదిరాజ్ అభ్యర్థికి కూడా సీటు కేటాయించక పోవడం విస్మయాన్ని కలిగిస్తోందని తెలంగాణ ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం లాలాగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను కేవలం ఓట్లు వేయడానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని చట్టసభలకు పంపే ఆలోచన ఏమాత్రం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రకటించిన అన్ని స్థానాల్లో ముదిరాజ్‌ల సంఖ్యాపరంగా బలంగా ఉన్నారని తెలంగాణలో 60 లక్షలకు పైగా జనాభా ఉన్న ముదిరాజ్‌లకు అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అవమానించినట్లేనని భావించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేసుకొని ముదిరాజ్‌లకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బోయిని శివకుమార్, రవీందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పజ్జన్న హ్యాట్రిక్ ఖాయం



మధుగౌడ్

అడ్డగుట్ట: సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పద్మారావుగౌడ్ హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టిస్తారని డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు మధుగౌడ్ ఓ ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేరు ప్రకటించడం హర్షణీయమన్నారు. గత రెండు పర్యాయాలుగా సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న పద్మారావుగౌడ్‌ను ఈ సారి కూడా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరి రిమాండ్

బౌద్ధనగర్: రాత్రి సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కొని పారిపోయిన యువకులను రిమాండ్‌కు తరలించిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రకాష్‌రెడ్డి వివరాల ప్రకారం.. బౌద్ధనగర్‌లోని సంజీవపురంకు చెందిన మల్లయ్య సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పార్శిగుట్ట చౌరస్తా సమీపంలో ఒక్కడే నడుచుకుంటూ వెళ్తుండగా ముగ్గురు యువకులు అతన్ని అడ్డగించి కత్తులతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా అతడు ససేమిరా అనడంతో దాడి చేసి రూ. వెయ్యి లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పార్శిగుట్టకు చెందిన ఆకుల విశాల్(22) కొప్పుల రవికుమార్(22)ను అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ప్రయాణికుడిపై రాపిడో డ్రైవర్ దాడి

అమీర్‌పేట: ప్రయాణ ఛార్జీ కన్నా ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయడాన్ని ప్రశ్నించిన ప్రయాణికుడిపై రాపిడో డ్రైవర్ దాడి చేసిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని జమున తీర్థ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సరిన్ దయాల్ దాదు (44) బుధవారం మధ్యాహ్నం అబిడ్స్ నుంచి అమీర్‌పేటలోని తన నివాసానికి వచ్చేందుకు రాపిడ్ బైక్ బుక్ చేసుకోగా ఇంటి వద్ద దింపాడు. ఛార్జీ మొత్తం రూ.89 కాగా రూ.100 ఇవ్వగా ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. దీనిపై డ్రైవర్‌ను నిలదీసి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా అడ్డుకుని ముఖంపై పిడిగుద్దుల వర్షం కురిపించాడు. బాధితుడికి తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



లాలాపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు, దేశభక్తిని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్ రావు, పి. మోహన్‌రావు, ప్రకాశం అధ్యయన సంస్థ ప్రతినిధులు సరోజ, గంథం సుబ్బారావు, రాధాకృష్ణ, హన్మంతరావు, రాజశేకర్ పాల్గొన్నారు.

మాజీ సీఎం చెన్నారెడ్డి కోడలు సరళాదేవి మృతి

లాలాపేట: మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తనయుడు మర్రి రవీందర్‌రెడ్డి సతీమణి మర్రి సరళాదేవి(70) మంగళవారం రాత్రి తార్నాకలోని ఆమె నివాసంలో మృతి చెందింది. బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి తదితరులు సరళాదేవి భౌతికకాయానికి నివాళి అర్పించి రవీందర్‌రెడ్డిని పరామర్శించారు.



నివాళి అర్పిస్తున్న కిషన్‌రెడ్డి

పేదలకు సేవలందించడం అభినందనీయం



వైద్య శిబిరంలో పాల్గొన్న సిద్ధ లింగప్ప

రసూల్‌పురా: పేదలకు ఉచితంగా సేవలందించడం అభినందనీయమని కర్ణాటక శాసనమండలి సభ్యులు సిద్ధ లింగప్ప, జవహర్ కెన్నెడి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురా న్యూ లైఫ్ ప్రేయర్ పవర్ చర్చిలో బిషప్ నేహమ్యా శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సేవలు చేయడం హర్షణీయమన్నారు. బిషప్ నేహమ్యా శ్రీనివాస్ రావు విద్య, వైద్య సామాజిక రంగాల్లో చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయానంద్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నా



కృష్ణారావుకు హారతి పడుతున్న ప్రజలు

సనత్‌నగర్: నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారమే తన పరమావధిగా భావిస్తూ ముందుకు సాగుతున్నానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపట్టిన పాదయాత్రలో భాగంగా 19వ రోజు బేగంపేట డివిజన్ మాతాజీ నగర్‌లో పర్యటించారు. ఆయా సమస్యల పరిష్కారానికి అక్కడే ఉన్న ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఈ తొమ్మిళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి పనులే దర్శనమిస్తాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించి ఎస్‌ఎన్‌డీపీ కింద బేగంపేట నాలా అభివృద్ధి ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పాదయాత్రలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ఇతరులతో పాటు వారి ప్రాణాలకూ ప్రమాదమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బుధవారం క్లాక్‌టవర్ ప్రాంతంలోని ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, మద్యంమత్తులో వాహనాలు నడుపుతున్నారని ఇవి ఎంతో ప్రమాదకరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. కారులో సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్ జోనల్ హెడ్ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్ కిశోర్‌బాబు, ఏఎస్‌ఐ వికారుద్దీన్, హీరో మోటర్ కార్ప్ ప్రతినిధి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఏసీపీని సత్కరిస్తున్న దృశ్యం

'డబుల్' ఇళ్లు కేటాయించాలని ధర్నా



ధర్నా చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: అర్హులైన వారందరికి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్యారడైజ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు ప్యారడైజ్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహిస్తుండగా పోలీసులు వారిని బొల్లారం స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం లక్ష ఇళ్లు నిర్మిస్తామని చెప్పి 10 వేలు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. దళిత, బీసీబంధు, డబుల్ బెడ్రూమ్‌లు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఈ ధర్నాలో రవీందర్, రాజు, రమేష్ ఖండేల్‌వాల్, వెంకట్‌రాజు, శంకర్, శ్రీశైలంగౌడ్, దయానంద్, క్రాంతి, లక్ష్మి, శ్రవణ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



బస్తీ ప్రజలతో మాట్లాడుతున్న లాస్యనందిత

రాంగోపాల్‌పేట్: తన తండ్రి రాజకీయ జీవితమంతా పేద ప్రజలకు అండగా ఉంటూ వచ్చారని ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తానని సాయన్న కుమార్తె కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ కేటాయించడంతో తండ్రి సెంటిమెంట్‌లాగే ఆమె గురువారం రెజిమెంటల్‌బజార్‌లోని చీపురుబస్తీలో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. తన తండ్రి కూడా ప్రతి ఎన్నికల్లో టికెట్ కేటాయింపు జరుగగానే ఇదే బస్తీ నుంచి ప్రచారం ప్రారంభించేవారని గుర్తు చేశారు. కంటోన్మెంట్‌లో ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తాను శాయశక్తులా కృషి చేసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ శ్రీనివాస్, నరసింహారావు ముదిరాజ్, అశోక్, కర్ణకుమార్, చిన్న, సంతోష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మోడల్ స్కూల్‌లో ఆటల పోటీలతో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజుల కబడీ, ఖోఖో అంతర్ పాఠశాలల టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ ముషీరాబాద్ మాజీ జోనల్ సెక్రటరీ కిశోర్‌కుమార్ అధ్యక్షత వహించగా ఓయూ మోడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ ప్రొ.శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు పాఠశాల స్థాయి నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ హెచ్‌ఎం జ్యోతిశ్రీ, సుధాకర్, డాక్టర్ జన్ను భిక్షపతి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీలత, మాజీ అధ్యక్షులు సోమేశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలరాజు, శ్రీనివాసమూర్తి తపాల్గొన్నారు. తొలి రోజు 25 పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు.

కులవృత్తిదారులను ఆదుకోవడమే లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: కులవృత్తిదారులను ఆదుకోవాలనే సంకల్పంతో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 300 మంది లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బీసీలకు ఆర్థిక సహాయ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారందరికీ దశలవారీగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి ఆశన్న, మారేడ్‌పల్లి తహసీల్దార్ పద్మా సుందరి, స్పెషల్ ఆఫీసర్ రాజేందర్, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, అరుణగౌడ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేష్ రాజు, అశోక్ యాదవ్, నరేందర్, నాగులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2 నుంచి ఇళ్ల కేటాయింపు..

సనత్‌నగర్: సెప్టెంబర్ 2 నుంచి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి తలసాని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియను 6–8 విడతల్లో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లోని తాతాచారికాలనీలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేలా డబుల్ బెడ్రూమ్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు యావత్ దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. బేగంపేట డివిజన్‌లో వర్షాలు పడుతున్నాయంటే వరదలు ముంచెత్తే పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో రూ.45 కోట్లతో ఎస్‌ఎన్‌డీపీ ద్వారా బేగంపేట నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. బేగంపేట డివిజన్‌లో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో వెయ్యి మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి తన సొంత నిధులతో వెయ్యి మిషన్లను ఉచితంగా అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరిశ్రీహరి, సతీష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి

మంత్రికి శుభాకాంక్షలు

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరుపున మరోమారు పోటీ చేసేందుకు టికెట్ దక్కడంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో వివిధ బస్తీల మహిళలు పెద్ద ఎత్తున మారేడుపల్లిలోని మంత్రి నివాసానికి చేరుకుని ఆయనను శాలువా, బొకేలతో సన్మానించారు.

- బండిమెట్‌కు చెందిన మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ, ఆనంద్, వినోద్, శ్రీకాంత్, కిశోర్ యాదవ్, బస్తీ ప్రజలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి అభినందనలు తెలిపారు.